క్లుప్తంగా

ఎన్జీజీవోస్ కాలనీలో అన్నదానం



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న పోతు సత్యనారాయణ తదితరులు

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు ఎన్జీజీవోస్ కాలనీలో శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా హిందూ ముస్లిం క్రిస్టియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం మధ్యాహ్నం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక నాయకుడు పోతు సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై భక్తులకు అన్న ప్రసాదం వడ్డించారు. కులమతాలకు అతీతంగా నిర్వహించిన కార్యక్రమంలో చిన్నారు ముస్లిం యువత, హిందూ, క్రిస్టియన్ యువత పాల్గొని మత సామరస్యాన్ని చాటారు.

ఆరోగ్య సంరక్షణపై శ్రద్ధ పెరగాలి



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సూర్యతేజ

మురళీనగర్: వయసు పెరిగే కొద్దీ వ్యక్తిగత ఆరోగ్య పరిరక్షణపై దృష్టి సారించాలని డాక్టర్ సూర్య తేజ సూచించారు. ఏజ్ కేర్ ఫౌండేషన్, ఆర్.బి.ఎల్.ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పట్టాభిరెడ్డితోటలోని వానప్రస్థ వృద్ధాశ్రమంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య సంరక్షణపై వృద్ధులకు అవగాహన కల్పించారు. వయసు పెరిగిన వారు తప్పనిసరిగా ఆహారపు అలవాట్లు మార్చుకోవాలన్నారు. తేలికగా జీర్ణమయ్యే ఆహారంతోపాటు పరిశుభ్రమైన నీటిని తీసుకోవాలని సూచించారు. కంటి పరీక్షలతోపాటు, బీపీ, సుగర్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. వానప్రస్థ వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న సభ్యులతోపాటు పట్టాభిరెడ్డితోట పరిసర ప్రాంతాల వృద్ధులకు ఉచితంగా పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వృద్ధాశ్రమం మేనేజింగ్ ట్రస్టీ రొబ్బి శ్రీనివాసరావు శిబిరం నిర్వహణకు సహకరించారు.

మేఘసందేశంపై సాహితీ ప్రసంగం



ప్రసంగిస్తున్న రచయిత్రి డాక్టర్ దేవులపల్లి పద్మజ

సీతంపేట: సహృదయ సాహితీ ఆధ్వర్యంలో స్థానిక రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో ప్రముఖ రచయిత్రి డాక్టర్ దేవులపల్లి పద్మజ మహాకవి కాళిదాసు రచించిన 'మేఘ సందేశం'పై ప్రసంగించారు. కుబేరుని కోపానికి గురైన యక్షుడు అలకాపురిలో ఉన్న భార్యకు మేఘం ద్వారా తన క్షేమ సమాచారాన్ని పంపుతూ, ఆ మేఘాన్ని రామగిరి, వింధ్యాచల పర్వతాలు, నర్మదా నది, ఉజ్జయని, హిమాలయాలు, గంగానది, కురుక్షేత్రం, కైలాసం సందర్శించమని చెప్పిన వైనాన్ని అద్భుతంగా వివరించారు. సభాధ్యక్షుడు కె.జి.వేణు ప్రసంగాన్ని విశ్లేషిస్తూ కాళిదాసు అభిజ్ఞాన శాకుంతలంలోని నాటకీయతను వివరించారు. ఈ కార్యక్రమంలో రచయితలు సీహెచ్ చిన సూర్యనారాయణ, డి.బి.ఆర్.శర్మ, సీహెచ్ నందగోపాలరావు, భాగవతుల సత్యనారాయణ మూర్తి, కె.వి.ఎస్.మూర్తి, కె.వి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గెడ్డలు, డ్రైనేజీలు

- రక్షణ గోడలు శిథిలమై రోడ్డుపై ప్రవహిస్తోన్న మురుగు నీరు
- పూడికలు నిండిపోవడంతో గెడ్డల్లో ఎక్కడి చెత్త అక్కడే
- దుర్వాసన, అపారిశుధ్యంతో స్థానికుల ఇబ్బందులు



వాసుదేవనగర్ గెడ్డ పూర్తిగా నిండిపోయి రోడ్డును తాకుతున్న డ్రైనేజీ నీరు



సింహగిరికాలనీకి వెళ్లే దారిలో ప్రమాదకరంగా డ్రైనేజీ



సింహగిరికాలనీలో రక్షణ గోడలు లేక కోతకు గురవుతున్న గెడ్డ



తాటిచెట్లపాలెంలో పూడికలతో నిండిపోయిన గెడ్డ

తాటిచెట్లపాలెం: వర్షాలు ప్రారంభం కావడంతో పలు ప్రాంతాల్లో పరిస్థితులు ప్రమాదకరంగా మారాయి. ఒక పక్క గెడ్డలు పొంగుతుంటే, మరో పక్క గెడ్డలు పూడికలతో నిండిపోయి ప్రమాదకరంగా మారాయి. ఈ కారణంగా గెడ్డలు నిండిపోయి డ్రైనేజీ, వర్షం నీరు రోడ్లపైకి ప్రవహిస్తోంది.

జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్లపాలెం దరి వాసుదేవనగర్ గెడ్డలో పూడికలు నిండిపోయాయి. ఇక్కడ మట్టి, చెత్త వచ్చి చేరడంతో గెడ్డ ఇటు నుండి అటువైపు వెళ్లే దారి ఇరుకైపోయి పూర్తిగా మూసుకుపోయింది. దీంతో ఇక్కడి గెడ్డలో నుండి వెళ్లాల్సిన మురుగు, వర్షపు నీరు రోడ్డుపై నీరు ప్రవహిస్తోంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఈ ప్రాంతంలో రోడ్డు పక్కల కుంగిపోయింది.

శిథిలమైన డ్రైనేజీ రక్షణ గోడ..

తాటిచెట్లపాలెం జాతీయ రహదారి పక్కన గల డ్రైనేజీ రక్షణ గోడ, దాని అంచున సుమారు రెండు అడుగుల మేర రోడ్డు కుదించుకుపోయింది. ఏ మాత్రం ఆదమరచినా డ్రైనేజీలోకి జారుకోవాల్సిందే. అంతేకాదు ఈ కారణంగా డ్రైనేజీలో ప్రవహించాల్సిన వర్షం నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. చిన్నపాటి వర్షం వచ్చినా ఈ దారిలో ప్రయాణించడం నరకాన్ని తలపిస్తోందని పాదచారులు, వాహన చోదకులు చెబుతున్నారు. రాత్రివేళల్లో ఆదమరిచి రాకపోకలు సాగించినట్లయితే రక్షణ గోడలు సరిగా లేని డ్రైనేజీలో పడడం ఖాయమని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కొండవాలు ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి..

జీవీఎంసీ 45వ వార్డు కొండవాలు ప్రాంతాల్లో కూడా గెడ్డలు, డ్రైనేజీల పరిస్థితి దారుణంగా ఉంది. పాత పోర్టు హైస్కూల్ వెనుక వైపు గల సింహగిరికాలనీ, సింగాలమ్మపురం కాలనీల్లో కొన్ని వందల ఇళ్లు ఉన్నాయి. వీరందరూ వాడిన నీరు ప్రవహించే డ్రైనేజీ చాలా మేరకు రక్షణ గోడలు లేనందున వర్షాలు కురిసినప్పుడల్లా కోతకు గురవుతోంది. ఇక్కడ సరైన డ్రైనేజీ వ్యవస్థ లేదు. దీంతో ఈ ప్రాంతంలో కూడా వర్షం వస్తే డ్రైనేజీ నీరు అంతా రోడ్డుపై ప్రవహిస్తోంది. ఈ కారణంగా పాదచారులు, వాహన చోదకులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు తమ సమస్యలను తక్షణం స్పందించాలని కోరుతున్నారు.

ప్రమాదకరంగా హైవే గెడ్డ..

తాటిచెట్లపాలెం హైవే వద్ద గెడ్డ పూర్తిగా నిండిపోయి ప్రమాదకరంగా ఉంది. పెద్ద వర్షం వస్తే పక్కనే గల వాసుదేవనగర్, లక్ష్మీనారాయణపురం ప్రాంతాల్లో వర్షం, డ్రైనేజీ నీరు వస్తోంది. వెంటనే సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని సరి చేయాలి.

– పి. అప్పలరాజు, తాటిచెట్లపాలెం

డ్రైనేజీలకు గోడలు లేవు..

సింహగిరికాలనీ, సింగాలమ్మపురం కాలనీల నుండి వచ్చే డ్రైనేజీ నీరు వెళ్లేందుకు సరైన ఏర్పాటు లేదు. పోర్టు హైస్కూల్ వెనుక వైపు సింహగిరికాలనీ నుండి వచ్చే నీరు నిలిచిపోతోంది. వర్షాలు పడితే మరీ దారుణం. ఇక్కడ డ్రైనేజీలకు గోడలు లేవు, సరైన కల్వర్టు కూడా ఇక్కడ లేదు.

– ఎస్. అప్పారావు, సింహగిరికాలనీ

వారం రోజులైనా... రోడ్ల పక్కనే చెట్లకొమ్మలు

నేటికీ తరలించని జీవీఎంసీ యంత్రాంగం



శంకరమఠం రోడ్ బేకర్స్ డెన్ వద్ద చెట్ల కొమ్మలు



అక్కయ్యపాలెం 80 అడుగుల రోడ్‌లో గణేష్ టెంపుల్ ఆర్చి వద్ద చెట్ల కొమ్మలు

సీతంపేట : దసరా రోజున గాలివాన బీభత్సానికి పడిపోయిన చెట్ల కొమ్మల తరలింపు ఇంకా కొలిక్కి రాలేదు. వారం రోజులు గడుస్తున్నా ఇంకా రోడ్ల పక్కన చెట్ల కొమ్మలు కుప్పలుగా దర్శనమిస్తున్నాయి. చెట్ల కొమ్మల నుంచి ఆకులు రాలి, వర్షానికి కుళ్లి రోడ్డు అంతా చిత్తడిగా మారుతున్నా అధికార యంత్రాంగం మాత్రం స్పందించడం లేదు. జీవీఎంసీ 43వ వార్డు పరిధి అక్కయ్యపాలెం 80 అడుగుల రహదారిలోని గణేష్ టెంపుల్ రోడ్‌లో ఆర్చి వద్ద చెట్ల కొమ్మలు తరలించకుండా అక్కడే వదిలేశారు. 25వ వార్డు పరిధి శంకరమఠం రోడ్‌లో బేకర్స్ డెన్ పక్కన రోడ్డుపై చెట్ల కొమ్మలు పోగులా పడి ఉన్నాయి. వారం రోజులైనా వాటిని తరలించకపోవడంతో స్థానికులు మండిపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

వాల్తేర్ డివిజన్ నూతన ఏడీఆర్‌ఎంగా రామారావు



తాటిచెట్లపాలెం: ఈస్ట్‌కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ నూతన అడిషనల్ డివిజినల్ రైల్వే మేనేజర్‌గా కుందు రామారావు నియమితులయ్యారు. శ్రీకాకుళం జిల్లా, పలాసకు చెందిన ఆయన 2002లో ఆంధ్రా యూనివర్సిటీలో బీటెక్ సివిల్ ఇంజినీరింగ్ పూర్తి చేసారు. ప్రజాసేవపై గల ఆసక్తితో 2006లో ఇండియన్ ఇంజినీరింగ్ సర్వీసెస్ పరీక్ష రాసి, ఆలిండియా 44వ ర్యాంకు సాధించి రైల్వేలో చేరారు. పలు జోన్లలో అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్‌గా, సీనియర్ అసిస్టెంట్ డివిజినల్ ఇంజినీర్‌గా, సీనియర్ డివిజినల్ ఇంజినీర్‌గా, డిప్యూటీ చీఫ్ ఇంజినీర్‌గా పని చేశారు. జపాన్‌లో నిర్వహించిన ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో కూడా ఈయన పాల్గొన్నారు. తన సేవలకు గాను ప్రతిష్టాత్మక జనరల్ మేనేజర్ అవార్డును 2010లో పొందుకున్నారు.

పదేళ్ల బాలుడికి అరుదైన శస్త్ర చికిత్స

తాటిచెట్లపాలెం: సీతమ్మధార కిమ్స్ ఆస్పత్రిలో పదేళ్ల బాలుడికి అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. ప్రస్తుతం బాలుడు ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. సుమారు పదేళ్ల బాలుడు గడచిన రెండు సంవత్సరాలుగా ఏదీ సరిగా మింగలేక, అన్నం తినలేక ఇబ్బంది పడుతూ సుమారు 4 కేజీల బరువు తగ్గిపోయాడు. ఎంత మంది వైద్యులకు చూపించినా ఫలితం లేకపోవడంతో బాలుడి తల్లితండ్రులు సీతమ్మధారలో గల కిమ్స్ ఆస్పత్రికి బాలుడిని తీసుకొచ్చారు. ఆస్పత్రి చీఫ్ కన్సల్టెంట్, మెడికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ చలపతిరావు ఆచంట బాలుడిని పరీక్షించారు. బాలుడు అకలేషియా కార్డియా అనే అత్యంత అరుదైన సమస్యతో బాధ పడుతున్నట్లు గుర్తించారు. ఈ సమస్య లక్ష మంది పిల్లల్లో కేవలం 0.11 శాతం మందికి మాత్రమే వచ్చేదని వైద్యులు తెలిపారు. ఈ విషయం కుటుంబ సభ్యులకు తెలిపి, అవసరమైన చికిత్సను విజయవంతంగా పూర్తి చేసారు. దీంతో కేవలం 24 గంటల్లోనే బాలుడు నోటి ద్వారా ఆహారం తీసుకోవడం ప్రారంభించాడు. రెండు నెలల తర్వాత బాలుడు 5 కిలోల బరువు పెరిగాడని తెలిపారు. గడిచిన ఐదేళ్లలో విశాఖపట్నంలో సుమారు 75 మందికి ఇటువంటి చికిత్స చేసి వారంతా నోటితో ఆహారం తీసుకునేలా చేసినట్లు, వారంతా ఇప్పుడు ఆరోగ్యంగా ఉన్నట్లు డాక్టర్ చలపతిరావు ఆచంట తెలిపారు.

అలరించిన సినీ సంగీత విభావరి

సీతంపేట: స్వర కళానిధి సాంస్కృతిక సంగీత సంస్థ అధ్యక్షుడు రైల్వే ప్రసాద్ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆద్యంతం అలరించింది. డీసీపీ నాయుడు, జ్యోతి పాడిన చిగురులు వేసిన కలలన్నీ, పెమ్మరాజు రామ్, రమణి పాడిన నీ అందానికి బంధం, అమ్మాజీరావు, పావని పాడిన ఇది మేఘ సందేశమో, సురేష్ కన్న పాడిన ఈ జీవన తరంగాలలో గీతాలు ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. కీ బోర్డుపై సోమేష్, ప్యాడ్స్‌పై బాబ్జి, తబలాపై రైల్వే ప్రసాద్, అప్పలరాజు వాద్య సహకారం అందించారు. ముందుగా రైల్వే విశ్రాంత అధికారి డీసీపీ నాయుడు, ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు చెన్నా తిరుమలరావు జ్యోతి ప్రజ్వలన చేసి సంగీత విభావరిని ప్రారంభించారు. కొణతాల రాజు, ఫణిస్వామి, మహమ్మద్ ఖాన్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణపై సదస్సు

మద్దిలపాలెం: ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణపై విద్యార్థులకు డాక్టర్ వి.ఎస్.కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం అవగాహన కల్పించారు. వృక్ష శాస్త్ర విభాగం, హరిత కృష్ణ ఎకో క్లబ్, ప్రజా ప్రగతి ట్రస్ట్, ఇండియా పొల్యూషన్ కంట్రోల్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించిన సదస్సుకు కళాశాల ప్రిన్సిపల్ ఐ.విజయబాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ ఆవశ్యకతను తెలియజేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.జయ, కో ఆర్డినేటర్ కె.రవిబాబు, వృక్ష శాస్త్ర విభాగాధిపతి ఎస్.పద్మావతి, హరిత కృష్ణ ఎకో క్లబ్ కో ఆర్డినేటర్ వి.పద్మజ, ఎ.హెచ్.డి.పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

నమ్మండి.. స్మార్ట్‌సిటీలోని రోడ్లే






అక్కయ్యపాలెం 80 అడుగుల రోడ్ నుంచి నందగిరినగర్ వెళ్లే గణేష్ టెంపుల్ రోడ్ దుస్థితి ఇదీ



శ్రీనివాసనగర్‌లో చెరువును తలపిస్తున్న సుపథ స్కూల్ రోడ్

శరవేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖ స్మార్ట్‌సిటీలోని రహదారులు గోతులమయమై మట్టి రోడ్లను తలపిస్తున్నాయి. చినుకు పడితే చిత్తడిగా మారిపోతున్నాయి. అడుగు పెట్టలేని విధంగా బురదమయమవుతున్నాయి. బుధవారం కురిసిన వర్షానికి జీవీఎంసీ 43వ వార్డు పరిధి 80 అడుగుల రోడ్డు నుంచి నందగిరినగర్, శ్రీనివాసనగర్‌కు వెళ్లే గణేష్ ఆలయం రోడ్, సుపథ స్కూల్ రోడ్ బురదతో నిండిపోయాయి. రోడ్డు అంతా గోతుల మయం కావడంతో వర్షపు నీరు నిండి చెరువుని తలపించింది. బురదమయంగా మారిన రహదారులపై వాహనచోదకులు, పాదచారులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కోసారి వాహనాలు జారిపడి ప్రమాదాలకు గురవుతున్నారు. 24/7 తాగునీటి సరఫరా పనుల కోసమని రహదారులను తవ్వి వదిలేశారు. గోతులను కాంక్రీట్‌తో పూడ్చకపోవడంతో చిన్నపాటి వర్షానికే చెరువులా మారిపోతున్నాయి. మూడు నెలలుగా జనం అవస్థలు పడుతున్నా పనులు మాత్రం కొలిక్కిరావడం లేదని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారులను పూర్తిస్థాయిలో పునరుద్ధించాలని పలువురు కోరుతున్నారు. – సీతంపేట

రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన



ప్రసాద్‌గార్డెన్స్ అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న నిపుణులు

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం తల్లులు, గర్భిణులకు రొమ్ము, గర్భాశయ క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. వ్యాధి నిర్ధారణ అయిన తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి మహిళలకు తెలిపారు. క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయించుకోవాలని, పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, పీహెచ్‌సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్ పర్యటనను విజయవంతం చేద్దాం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సాడి పద్మారెడ్డి, ముువ్వల పోలారావు, నాయకులు

సీతంపేట: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తలపెట్టిన మాకవరపాలెంలోని మెడికల్ కళాశాల పర్యటనను విజయవంతం చేయాలని 24వ వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి పిలుపునిచ్చారు. 25వ వార్డు మాజీ కార్పొరేటర్ మువ్వల పోలారావు, మువ్వల సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గురువారం ఉదయం 9 గంటలకు జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారని, వార్డు నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఆయనకు ఘన స్వాగతం పలకాలన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు గుదే రాజు, సారిపిల్లి సంతోష్, సానబోయిన సురేష్, పోతిబంతి హరికృష్ణ, జోరీగల గణేష్, మొండూరి అప్పలరాజు, సత్యనారాయణ, సూరిబాబు, శ్రవణ్‌కుమార్, ముద్దాడ అశోక్, పప్పు ప్రసాద్, రవీంద్ర, బడే శ్రీను, అలమండ శంకర్, ఉమ తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ జోసెఫ్‌లో రచయిత్రుల జాతీయ సదస్సు



జ్యోతి ప్రజ్వలనతో సదస్సును ప్రారంభిస్తున్న అతిథులు



అతిథులు, అధ్యాపకులతో విద్యార్థినులు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో భాషా విభాగాల ఆధ్వర్యంలో 'స్వాతంత్ర్యానంతర తెలుగు–హిందీ సాహిత్యంలో రచయిత్రుల సాహిత్య కృషి' అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ అధ్యక్షతన బుధవారం జరిగింది. గాంధీ సెంటర్ అధ్యక్షులు, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం మాజీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ వి.బాలమోహన్‌దాస్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలనతో సదస్సును ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రచయిత్రుల కృషి అభినందనీయమన్నారు. గౌరవ అతిథులుగా హాజరైన ఏపీడబ్ల్యూజే అధ్యక్షుడు డాక్టర్ ఎస్. కృష్ణబాబు, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ డి.వి. సూర్యారావు రచయిత్రుల సాహితీ కృషి గురించి మాట్లాడారు. ఈ సందర్భంగా రైటర్స్–జర్నలిస్ట్స్ అసోసియేషన్ సౌజన్యంతో జరగనున్న రెండు రోజుల సదస్సుకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. సదస్సు కన్వీనర్, కళాశాల కో–ఆర్డినేటర్ డాక్టర్ పి.కె. జయలక్ష్మి రచించిన కథల సంపుటిని, సెమినార్ గ్రంథాన్ని అతిథులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ద్వితీయ భాషా విభాగాధ్యక్షులు డాక్టర్ జె.నిర్మల, డాక్టర్ ఎస్.దీప్తి, డాక్టర్ కోటేశ్వరరావు, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

జీవన నైపుణ్యాలతోనే ఉన్నత స్థానం



ధ్రువపత్రాలు పొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ కేవీ రమణ

మురళీనగర్ : పాలిటెక్నిక్ కెమికల్ డిప్లొమా విద్యార్థులు సబ్జెక్టులో పట్టు సాధించడంతో పాటు జీవన నైపుణ్యాలు పెంచుకోవడం ద్వారానే ఉన్నత స్థానానికి చేరుకోగలరని కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ (గైస్) ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ రమణ తెలిపారు. గైస్ కెమికల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉన్నత ఫౌండేషన్ నిర్వహించిన నైపుణ్య శిక్షణ ముగింపు సందర్భంగా బుధవారం ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సమాచార నైపుణ్యాలు, ఆంగ్ల భాషలో మాట్లాడడం, జీవన నైపుణ్యాలను పెంచుకోవడం వంటి అంశాల్లో శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. స్వీయ నిర్వహణ, బృంద సభ్యులతో సమన్వయం చేసుకుని పని చేయడం ద్వారా ఉద్యోగాల్లో రాణించగలరని చెప్పారు. అనంతరం విద్యార్థులకు ధ్రువపత్రాలు అందించారు. కార్యక్రమంలో పెట్రో కెమికల్స్ హెడ్ సీహెచ్ జయప్రకాష్‌రెడ్డి, సీనియర్ లెక్చరర్లు పాల్గొన్నారు.

విశాఖ రైల్వేస్టేషన్‌లో అమృత్ సంవాద్



ఉత్తమ సూచన అందజేసిన ప్రయాణికురాలికి కానుక అందజేస్తున్న రైల్వే అధికారి పవన్‌కుమార్

తాటిచెట్లపాలెం: ప్రత్యేక క్యాంపెయిన్–5లో భాగంగా ప్రయాణికుల భాగస్వామ్యంతో కూడిన అమృత్ సంవాద్ కార్యక్రమాన్ని విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో బుధవారం నిర్వహించారు. జనరల్ స్లీపర్ క్లాస్ వెయిటింగ్ హాళ్ల వద్ద వాల్తేర్ డివిజన్ కమర్షియల్ మేనేజర్ కె. పవన్‌కుమార్ ప్రయాణికులతో ముచ్చటించారు. వారి సలహాలు, సూచనలు స్వీకరించారు. రైల్వే అధికారులు, ప్రయాణికుల ప్రత్యక్ష సమాచార ప్రక్రియలో భాగమే అమృత్‌సంవాద్. అక్టోబరు 31వ తేదీ వరకు జరిగే ఈ ప్రత్యేక క్యాంపెయిన్‌లో భాగంగా రైల్వే అధికారులు స్వయంగా ప్రయాణికుల నుండి పలు సూచనలు స్వీకరిస్తున్నారు. విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో బుధవారం జరిగిన అమృత్ సంవాద్ కార్యక్రమంలో భాగంగా ప్రయాణికులు కొన్ని సూచనలు చేశారు. ఎస్కలేటర్స్ దగ్గర కచ్చితంగా సహాయకులను నియమించాలని, వారు లేకపోవడంతో సీనియర్ సిటిజన్లు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అలాగే స్లీపర్‌క్లాస్ కోచ్‌లలో రైల్వేనే భోజనం ఏర్పాటు చేయడం మంచిదని పలువురు తెలిపారు. వీరికి సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె. పవన్‌కుమార్ చిరు కానుకలు అందజేశారు.